# మనీ ప్లస్ షి మైనస్ ఆత్మ

బొల్లిముంత నాగేశ్వరరావు




'నదిలో పడి స్త్రీ ఆత్మహత్య' అన్న వార్త చదివాక హఠాత్తుగా సరళాదేవికో అనుమానం వచ్చింది!


'ఆత్మ ఉన్న వాళ్ళు హత్య చేసుకుంటారా? తన కంటూ ఒక ఆత్మ ఉందా?' తన మనసులో అలా రెండు ప్రశ్నలు రావటంతో ఆమెకి కాస్త ఆశ్చర్యం వేసింది.

ఆ స్త్రీ ఎందుకు హత్య చేసుకుందో, కారణా లేమిటో ఆమె కప్పట్లో తెలిసే అవకాశం లేకపోయినా రెండు మూడు సంవత్సరాల క్రితం 'ఎండ్రిన్' తాగి మరణించిన ఒక స్త్రీకి వెనక ఉన్న కారణాలు లీలగా మనసులోకి వచ్చాయి.

అప్పటికి తాము విజయవాడ చేరలేదు. తెనాలి లోనే కాపరం. అద్దె ఎక్కువైనా కాస్త మంచి ఇల్లే దొరికింది. పట్టణానికి కాస్త బయట కావటంతో ఆ వీధిలోకి గ్రామ వాతావరణం చోటు చేసుకుంది. ఒకరినొకరు పలకరించుకోవటం ఎవరికి ఆపద వచ్చినా అంతా రావటం—తమకా వీధి వాతావరణం ముచ్చట గానే కనిపించింది.

తమ ఇంటి ముందే వరదయ్యగారి ఇల్లు. చిన్న డాబా, చుట్టూ అంత ఎత్తుగా లేని ప్రహరీ, అందులో వరసలు తీరి పహరా కాస్తున్నట్టు నిటారుగా పెరిగిన కొబ్బరిచెట్లు—ఇల్లు చూడటానికి ఎంతో అందంగా కనిపించేది. ప్రహరీకి ఒక మూల ఇంటికి ముందు భాగంలో బయటికి కనిపించే గులాబీపొద ఉదయ సంధ్య పూవుల్ని విరబూచి నవ్వుతూ పలకరించేది. డాబా పిట్ట గోడ దాకా ఎదిగిన సన్నజాజి పొందాగా, ఎత్తుగా గాలిలో ఊగుతూ కనిపించేది.

అవన్నీ ఎంత అందంగా కనిపించేవో వరదయ్యగా రంత వికృతంగా కనిపించే వాడు. మనిషి నల్లగా, కడుపు లావుగా ఉండి నడుస్తుంటే ఏదో సర్కస్‌లోని ఎలుగుబంటు వంగి నడుస్తున్నట్టు వింతగా కనిపించే




వాడు. ఇరవై ఎకరాల దాకా పొలం ఉండటంతో వ్యవసాయం ముఖ్య వృత్తిగా గడిపేవాడు.

ఆయన సాయంసమయాల్లో లాల్చీ వేసుకుని గొడుగు తీసుకుని ప్రతి రోజూ ఇల్లు విడిచి పోతుండే వాడు. మరలా ఎప్పటికీ రాత్రి తొమ్మిదీ పదీ ప్రాంతంలో వస్తుండే వాడు. ఆయనలా వెడుతుండటంలో గల కారణం తరవాత తెలిసింది.

వీధుల్లో అరటికాయలూ, బటానీలూ మొదలయినవి అమ్ముకుంటూ జీవనం చేసే వాళ్ళకీ, రిక్షాలు లాగే వాళ్ళకీ డబ్బులు అధికమైన వడ్డీలకిస్తుంటాడనీ, అవి వసూలు చేసుకుంటాడనీ చెప్పారు. ఒక కాయ అమ్ముకునే వ్యక్తి వరదయ్య దగ్గర పది రూపాయలు తీసుకోవాలంటే. వరదయ్య అతని చేతిలో పెట్టేది తొమ్మిది రూపాయలే. రోజు గడిస్తే మరలా ఆ వ్యక్తి వరదయ్య చేతిలో పది రూపాయలు పెట్టాల్సి ఉంటుంది. ఇరవైనాలుగు గంటలు గడిచే సరికి వరదయ్య తన దగ్గరున్న పది రూపాయలకీ రెండు రూపాయల వడ్డీ సంపాదిస్తాడు. ఆ లెక్కన నెల మీద ఆ పది రూపాయలూ ముప్పయి రూపాయలకు పైగా వడ్డీని సంపాదించి పెడుతుంది., తలంచుకుంటే గుండెలు పగిలి పోయే దోపిడీ.

అయినా ఆ నికృష్ట జీవులు దానికే అలవాటు పడతారు. వరదయ్య దోపిడీయే కాకుండా వీరికి మరి కొన్ని కష్టాలు వీధుల్లో ఎదురవుతాయి. బీటు కానిస్టేబుల్‌కి పావులా చెల్లించుకోవాలి. మార్కెట్ రేట్లు పెరిగాయని వారి మధ్య ఆ మామూళ్ళను ముప్పయి పైసల దాకా పెంచేశారుట. వీరిని వదిలించుకున్నాక బజారు గూండాలతో మరో బెడద ఉంటుంది, పంచదార కంట్రోలు వచ్చాక దానిని మార్కెట్లో రేట్లు పెరిగినట్లు అదేదో గూండా యాక్టు వచ్చాక వారూ రేట్లు పెంచి గట్టిగా వసూలు చేస్తున్నారుట. ఒక వేళ మేం పట్టుబడితే జరిమానా చెల్లించుకోవాలి కదా. అందుకని పెట్టుబడిగా ముందే వసూలు చేసుకుంటున్నామంటున్నారుట.

పక్క ఇంట్లో చదువుకునే 'సుజాత ఈ విషయా లన్నీ వివరించేది. సుజాత కాలేజీ లెక్చరర్‌గా రమ్మాయి. ఎన్నెన్నో విషయాలు చెబుతుండేది. ఎంతో చలాకీగా ఉండేది.

తీర్చి దిద్దినట్టు ముక్కూ, ఎర్రటి పెదాలూ విశాలంగా ఉండే కళ్ళూ, ఇంకా విశాలంగా కనిపించే నొసలూ ముఖం ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. వడ్డీల వరదయ్యనికూడా ఆయన్ను అంటారని తరవాత తెలిసింది.

వరదయ్యగారికి ఒకడే కొడుకు. చదువు వంట బట్టలేదు. తండ్రి ఆకారానికి దగ్గరగా ఉంటుంది. మనిషి కాస్త ఎత్తు. తండ్రి చెప్పినట్లు వ్యవసాయం పనులు చేస్తుండే వాడు.

పట్నంలో ఉంటున్నా కాస్తంత నాగరికతకూడా వంటబట్టలేదు. ఎవరితోనూ సరిగా మాట్లాడే వాడు కాదు. ఏడాది క్రితమే వివాహం అయింది. కొత్తగా కాపరాని కొచ్చింది జయప్రద. మనిషి తీర్చి దిద్దిన బొమ్మలా ఉండేది. తెనాలికి దగ్గరలో ఒక పల్లెటూరు.

తీరిగ్గా ఉన్నప్పుడు తన దగ్గరకు వచ్చేది. ఏవేవో కబుర్లు అమాయకంగా చెబుతుంది. అమాయకమైన ఆ చూపుల వెనక ఏదో నిగూఢమైన ఆవేదన అవ్యక్తంగా ఉండిపోయేది.

వారి ఇంటికి వెనక విశాలంగా కొంత ప్రాంత ముంది. అందులో వరదయ్య కాలకూరగాయల్ని పండించే వాడు. అప్పుడప్పుడు జయప్రద కొద్దిగా కూరగాయల్ని తీసుకొచ్చేది. తోటకూర కాడల్నికూడా తరచూ అందిస్తుండేది.

'కూరగాయలు ఎవరికి పెట్టినా మా మామగారు ఊరుకోరు'

ఒకరోజు జయప్రద తనతో అన్నప్పుడు.—

'అదేం? అసలు నీవు తేవద్దు. కావాలి ఎటు తిరిగీ కొంటూనే ఉన్నాంగా. మరలా నీకు వాళ్ళతో పేచీ. వద్దమ్మా జయప్రదా.' తను వెంటనే అనటం జరిగింది.

'ఏం పేచీ. ఇదేం పేచీలే అక్కాయి. అసలు పేచీ అలాగే ఉంది'. నిట్టూర్పుతో అన్నప్పుడు అర్థంకాని బాధ ఏదో ముఖం లోంచి బయటికి తొంగి చూసింది.

'ఏం పేచీ.' తను యాంత్రికంగా అడిగినప్పుడు జయప్రద చెప్పలేదు. ఒక విధంగా నవ్వి ఊరుకుంది. తనడగటం పొరపాటుగా తరవాత నాలుక కరుచుకోవటం జరిగింది.

తనతో అలా అన్న ఏడెనిమిది రోజులకు జయప్రద ఎండ్రిన్ తాగింది.

మొదట ఎండ్రిన్ తాగినట్టు ఎవరికీ తెలీయలేదు. మూర్ఛల రోగ ముందని వరదయ్య బాహాటంగా చెప్పి, బంధువులు రాకముందే దహనం చేశాడు.

జయప్రద చనిపోయిందంటే అప్పట్లో తన కెంత ఆశ్చర్యం కలిగింది.

సుజాత విషయం ఎలా సేకరించిందో ఏమో. జయప్రద చనిపోయిన కారణా లన్నీ వివరించింది.

జయప్రద తల్లి దండ్రులు అమాయకులు. వారి కో కుమారుడూ, జయప్రదా తప్ప ఎవ్వరూ లేరు. వరసగా కొట్టిన వడగాడ్పు తు ఫానుల్లోనూ వారికి పంట సరిగా చేతికి రాలేదు. ఫలితంగా ఇస్తామన్న కట్నం ఇవ్వలేక పోయారు.

ఈ విషయమై జయప్రదను నిత్యమూ బాధ పెడుతూనే ఉన్నారు. చివరికి కట్నం ఇవ్వకపోతే ఇంటికి పొమ్మనీ, వారిచ్చే దాకా అక్కడే ఉండమనీ దురుసుగా ఒత్తిడి చెయ్యటం మొదలెట్టారు.

జయప్రద ఇంటికి పోవటానికి అంగీకరించలేదు. మామ పోరూ, భర్త పోరూ ఎక్కువయ్యింది. దొడ్లో ఉన్న ఎండ్రిన్ డబ్బా లోని ఎండ్రిన్ తాగింది.

జయప్రద తల్లి దండ్రులు వచ్చి ఏడ్చి పోయారే తప్ప ఏ విధంగానూ వరదయ్యతో పోట్లాడలేదు. వారి అమాయకత్వానికి ఒక విధంగా జాలికూడా వేసింది.

జయప్రదను గురించి ఎంతో ఆవేదన కలిగింది. వరదయ్యనూ, అతని కొడుకునూ చూసినప్పుడు వీళ్ళు మనుషులేనా అనిపించేది. ఏది ఏమైనప్పటికీ ఆ లోహ రాక్షసుల కర్కశత్వంలో సున్నితమైన జయప్రద తన ప్రాణాల్ని కోల్పోయింది.

జయప్రద ఆత్మహత్య చేసుకుందంటే తనకు మనసు అంగీకరించటం లేదు. అత్మ అందులో ఆలోచనా లేనివాళ్ళు ఇలా హత్య చేసుకుంటారేమో అనిపిస్తుంది.

జీవితం విలువయింది. మరో జన్మ ఉత్తదే అని సైన్సు చెబుతుంది. విలువైన జీవితాన్ని ఎదురు తిరిగి బాగు చేసుకోవాలే తప్ప, ఏడ్చి హత్య చేసుకో కూడదనిపిస్తుంది.

సుజాత అన్న మాటలు ఇప్పటికీ తనకు గుర్తే.

'ఇలా చనిపోతే ఎలా అక్కా! ఈ కట్నాల విష వలయం నుంచి స్త్రీ బయటపడాలి. ఆత్మ ధైర్యంతో నిలబడాలి. స్త్రీ కున్న నిజమైన విలువల్ని గౌరవించని పురుషుడే లేనప్పుడు, వివాహం కాలేదని ఏ ఆడపిల్లా విచారపడకూడదు.

కనీసం శిశువుల్లోనైనా ఒక నీతి ఉండక్కా

ఒక పశువు తన జంటను వెదుక్కుంటున్నప్పుడు, ఎత్తి కడుతున్నప్పుడు, ఆడపశువును పట్టుకుంది.

'నాకు తినేందుకు ఎంత గడ్డి వాను తెచ్చావని అడుగుతుందా?' లేదు. ప్రేమమైకంలో ఏకత్వాన్ని పొందుతుంది. పక్షులు మాత్రం ఎలా జంట పుతాయో మనకు తెలీదా? కష్టంలో సుఖంలో కలిసే బతుకుతాయి. కానీ, ఏ మగపక్షీ ఆడపక్షి తెచ్చే ఆహారం కోసం పొంగ కార్చుతూ రెక్కలూపదు.

మగ దరిద్రం కొద్దీ ఈ మగవాళ్లే తయారయ్యారు...... ఎంతో అనుభవం ఉన్నా దానిలా ఏవేవో రకరకాల విషయాలు చెప్తుండేది.

"సుజా...! నీవు కట్నం తీసుకునే మగవాడ్ని చేసుకోనా?" తనడిగినప్పుడు—

"అమ్మో—అలాంటి మగవాడంటే నే నాకు భయం. ఆత్మను చంపుకుని, దాని స్థానంలో 'మనీ'ని మూటగట్టి' నీజతకొస్తున్నాను—నన్ను అంగీకరించు పురుషదేవా" అని ఎవరిముందూ నేను నిలబడలేను.

సుజాత మాటలకు అప్పట్లో తనకే విధమైన భావమూ కలగలేదు. మెల్లిగా నవ్వి మాత్రమే పూరుకోవటం జరిగింది.

కానీ ఇప్పుడు మనసంతా ఆందోళనగా ఉంది. రోజు కో స్త్రీ ఆత్మహత్యవార్తల్ని ఈ పేపర్లలో చదువుతున్నప్పుడు— ఈ స్త్రీలపై విలువైన ప్రాణాల్నిక్కడి పరిసితి ఎలా హత్యలు చేస్తుందో ఆలోచిస్తుంటే ఒక విధమైన భయం కూడా కలుగుతుంది?

సుజాత లెక్క ప్రకారమే అయితే... తనకూ ఆత్మలేనట్టే— దాని స్థానంలో పది వేల రూపాయల్ని మూటగట్టుకుని ఈ మూడు ముళ్ళు వేసినాయనతో జీవితాన్ని ముడి వేసుకోవటం జరిగింది.

అమ్మా—నాన్నా పదివేలూ ఉండి ఇచ్చారా? ఉన్న రెండెకరాల్లో ఎకరం అమ్మి ఇచ్చారు. పూర్లో హైస్కూలు ఉండిగాబట్టి తను పదో తరగతి వరకూ చదవటం జరిగింది. అనుకున్న ట్రైవ్ పదివేలూ ఇవ్వకపోతే తన పరిస్థితి ఎలా ఉండేదో!

ఆలోచించుకుంటున్న సరళాదేవికి ఒక్కసారి భయం కలిగింది. కానీ తనను తాను తమాయించుకుంది.


వరదయ్య కుటుంబంలాగానే పీరూ ధనం కోసం ఆటవికంగా ప్రవర్తించేవారా?

కాకపోవచ్చు. స్త్రీ విలువల్ని మరుగుపర్చి మనీని గుర్తు చేసినప్పుడల్లా తన హృదయాంతరాల్లో ఎంత ఆవేదన అనుభవించాల్సి వచ్చేదో— ఎంత కుళ్ళి కుళ్ళి ఏడ్వాల్సివచ్చేదో....

అందుకే... సుజాత ఇలా ఏడ్చే వాళ్ళ నందరినీ ఆత్మలు లేని బొమ్మ లన్నది.

సరళాదేవికి తెలియని ఆవేశమేదో వచ్చింది. ఒక్కసారి ఈ లోకానికంతా వినపడేట్టు బిగ్గరగా అరవాలనుకుంది.

"వద్దు.... మీరు హత్యలు చేసుకోవద్దు. ఈ పత్రికలన్నీ వాటిని ఆత్మహత్యలని హెడ్డింగులు పెట్టి వ్రాస్తున్నాయి. నిజమైన



ఆత్మలే ఉంటే మనం ఎప్పటికీ హత్యలు చేసుకోం— ఆ నిజమైన ఆత్మల్ని మనం ఏనాడో చంపుకున్నాం. ఇప్పుడు మనం చెయ్యాల్సింది ఆ చచ్చిపోయిన ఆత్మల్ని బ్రతికించుకోవటం. అంతేగానీ, శూన్యమైన శరీరాన్ని చంపుకోవటం కాదు.

కట్నం అడిగేవాళ్ళని ఒక్కటి సూటిగా అడగండి.

"అమ్మా, అంతులో అభిమానమూ ఉన్న ఒక విలువైన స్త్రీ కావాలో ధనంవెలకు దిగజారిన ఆత్మలేని స్త్రీ కావాలో...?!

సరళాదేవికి వెంటనే మరో ఆలోచన వచ్చింది. ఆత్మల్ని చంపుకుని 'మనీ' విలువకి దిగజారింది స్త్రీనా లేక పురుషుడా?

తళుక్కున ఆమె మనసులోకి ఒక ఆలోచన వచ్చింది. క్లర్క్ ఉద్యోగమైతే ఐదువేలూ, ఆపై ఉద్యోగమైతే పదివేలూ ఇంజనీరైతే పాతికవేలూ డాక్టరైతే ఏభై వేలూ.... ఇలా తనకు వెలలేని మానవత్వాన్ని ధనం వెలలకు దిగజార్చుకుంది పురుషుడూ కదూ??

అవును.... మనమ్మాటికీ పురుషుడే....

అయితే ఇక్కడ స్త్రీకి ఆత్మ ఎలా చని పోయినట్టు...?

సరళాదేవి సందిగ్ధంలో పడిపోయింది.

మరలా వెంటనే తేరుకుంది.

అవును—స్త్రీకే ఇక్కడ ఆత్మ చచ్చిపోయింది. మానవత్వ విలువలకంటే— మనీ విలువలో తనను తాను కుదించుకున్న ఒక పురుషుడ్ని భర్తగా అంగీకరించటమంటేనే... నిజంగా ఆమె ఆత్మ చంపుకుంది. ఆ ఆత్మస్థానంలో కొంత డబ్బును మూటగట్టి పెట్టింది. ఆ ధనం మూటలో తన విలువలు ప్రతిఫలించిన ప్రతి మగవాడూ దగ్గరకు చేరతాడు— ఎవరితోనో ఒకరితో జీవితాన్ని ముడి వేసుకుంటుంది.

ఈ ముడిలో నిజమైన పవిత్రత ఉందా?

లేదు — ధనం దురాశ వరల క్రింద ఆమె సజీవంగా సమాధి చెయ్యబడింది. పురుషాధిపత్యపు పదఘట్టనలో ఆమె పాతాళపు లోతుల్లోకి నెట్టబడింది.

అందుకే ఇప్పుడు స్త్రీ చేసుకుంది ఆత్మహత్య కాదు— ఆత్మల్ని ఎప్పుడో ఈ కట్నాల వ్యవస్థ కసాయిగా నరికేసింది...

సరళాదేవికి ఒక్కసారి ఆశ్చర్యం వేసింది. తనేనా ఇలా ఆలోచిస్తుంది.

ఇంత ఆవేశంగా.... ఇంత అసహ్యంగా...

అయితే దీనికి పరిష్కారం?

ప్రశ్న పెనుభూతంలా ముందు పెరిగిపోతుంది. సరళాదేవి కూడా అంతకు వెయ్యిరెట్లు పెరిగి పోయి సమాధానం చెప్పుకుంది.

చీకటికి వెలుతురూ—

కష్టానికి సుఖమూ—

చేదుకు తీపి— ఇక్కడి బ్రతుకుల నాణాలకు బొమ్మా, బొరుసులు. ఇప్పటి వరకూ స్త్రీ ఇవతలివైపు జీవితంలోనే నిర్జీవంగా గడిపింది. ఆమెకు రేపు తప్పని సరిగా వస్తుంది— .

ఆ రేపు కోసమే ఇప్పుడామె తిరుగుబాటుకు నిలబడాలి. ఈ కట్నాల సంబంధాల్ని కటువుగా తిరస్కరించాలి. కష్టమో సుఖమో కలిపి పంచుకునే వాడ్ని వెదుక్కోవాలి. అంతా సుజాతల్లా మారిపోవాలి. జయప్రదల్లా జీవితంలో దారుణమైన పోటుమికి గురి కాకూడదు.

తన వంతు కర్తవ్యం ముగిసింది. తామంగా ఇక చేయగలిగిందేంలేదు. ఈ తరం స్త్రీలైనా తమ శరీరాల్లో ఆత్మల్ని నిలుపుకోలేకపోతే, ఈ జీవితాలకు అర్థం ఉండదు.

అలాకాకుంటే

మనీ ప్లస్ షి మైనస్ ఆత్మగానే ఆమె మిగిలిపోతుంది.

సరళాదేవి కళ్ళలో ముందు కాలానికి సంబంధించిన ఆశ తళుక్కున మెరిసింది. *